క్లుప్తంగా

ఆంజినేయస్వామికి ప్రత్యేక పూజలు



కౌతాళం: మండలంలోని ఆంజనేయ స్వామి ఆలయాలకు శనివారం భక్తులు అధికంగా తరలివచ్చి పూజలు నిర్వహించారు. దీంతో స్వామి ఆలయాలు భక్తులతో సందడిగా మారాయి. మండల కేంద్రమైన కౌతాళం, మండల పరిధిలోని అగసలదిన్నె గ్రామంలో వెలసిన ఆంజినేయస్వామి, సుళేకేరి గ్రామ శివారులో వెలసిన బుడుములదొడ్డి ఆంజనేయస్వామి దేవాలయం, ఎరిగేరిలో వెలసిన పులిగట్టు ఆంజనేయస్వామి దేవాలయాల్లో స్వామికి ప్రత్యేక పూజలను నిర్వహించారు. తెల్లవారుజామున అర్చకులు స్వామికి సుప్రభాతసేవ, మహామంగళహారతి, ఆకుపూజ, పంచామృతాభిషేకం వంటి ప్రత్యేక పూజలను చేపట్టారు.

తాగునీటి సరఫరా సక్రమంగా జరిగేలా చూడండి



మున్సిపల్ వాటర్ సెక్షన్ కార్మికులతో మాట్లాడుతున్న ఎంఈ చలపతి

ఆదోని టౌన్: పట్టణంలో తాగునీటి సరఫరా సంక్రమంగా జరిగేలా చూడాలని మున్సిపల్ ఎంఈఓ చలపతి సిబ్బందిని ఆదేశించారు. శనివారం ఆయన స్థానిక మున్సిపల్ వాటర్ సెక్షన్ కార్మికులతో సమావేశమై మాట్లాడారు. పట్టణంలోని బావాజీపేట రెండో వార్డులోని చౌదరిబావి వద్ద నీరు పంపింగ్ జరగడం లేదని ఫిర్యాదులు అందాయన్నారు. తప్పనిసరిగా మున్సిపల్ వాటర్ సెక్షన్‌కు సంబంధించి ఒక వ్యక్తి దగ్గరుండి నీటి పంపింగ్ చేయాలన్నారు. నీటి సమస్య తలెత్తకుండా తగిన చర్యలు తీసుకోవాలన్నారు.

మధ్యవర్తిత్వం ద్వారా కేసులను పరిష్కరించుకోండి



మాట్లాడుతున్న న్యాయవాదులు

ఆదోని రూరల్: మధ్యవర్తిత్వం ద్వారా వివాదాలను పరిష్కరించుకోవాలని మధ్యవర్తిత్వ న్యాయవాదులు ఆనంద్, బి.నెట్టకంటయ్య సూచించారు. శనివారం ఆదోని మండల న్యాయసేవాధికార సంస్థ చైర్మన్ పి.జె.సుధ ఆదేశాల మేరకు స్థానిక కోర్టు ఆవరణలో మధ్యవర్తిత్వం ద్వారా కేసుల పరిష్కారం గురించి ప్రజలకు అవగాహన కల్పించారు. వారు మాట్లాడుతూ సంవత్సరాల తరబడి కోర్టుల చుట్టూ కక్షిదారులు తిరుగుతూ సమయాన్ని వృథా చేసుకోరాదన్నారు. మధ్యవర్తిత్వం ద్వారా కేసులను పరిష్కరించేందుకు ముందుకు రావాలన్నారు. సమావేశంలో మధ్యవర్తిత్వ న్యాయవాదులు ఎం.వి.లోకేష్‌కుమార్, బి.వీరేష్, ఎన్.రామాంజనేయులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే ఆర్థిక సాయం



మృతుని కుటుంబ సభ్యులకు ఆర్థిక సాయం అందజేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

కోసిగి: మండల కేంద్రం కోసిగిలోని వడ్డే వీధిలో నివాసం ఉంటున్న వడ్డే అంజినయ్య, గోవిందమ్మ దంపతుల కుమారుడు, వైఎస్సార్ సీపీ కార్యకర్త వడ్డే ఎల్లప్ప (30) కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ కోలుకోలేక శనివారం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే వై. బాలనాగిరెడ్డి , వైఎస్సార్ సీపీ జిల్లా కార్యదర్శి పి. మురళీ మోహన్ రెడ్డి ఫోన్ ద్వారా ఆయన మృతి పట్ల సంతాపం తెలిపారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన అంత్యక్రియల నిమిత్తం రూ.5వేలు ఆర్థిక సాయం చేశారు. వైఎస్సార్ సీపీ మండల ఉపాధ్యక్షులు ముకుంద కృష్ణమూర్తి, ప్రధాన కార్యదర్శి గానిగ వీరస్వామి, బీసీ సెల్ అధ్యక్షులు కట్టెల నరసింహులు, వేమారెడ్డి వడ్డే ఉలిగయ్య, అంజి, తిక్కయ్య, వడ్డే వీరేష్‌లు మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎమ్మెల్యే అందించి నగదును కుటుంబ సభ్యులకు అందజేశారు. ఎమ్మెల్యే కుటుంబం ఎల్లవేళల అందుబాటులో ఉంటుందని భరోసా కల్పించారు.

ఆటలతో ఆరోగ్యం



క్రికెట్ ఆడుతున్న ఎమ్మెల్యే పార్థసారథి

ఆదోని అర్బన్: ఆటలు ఎంత బాగా ఆడితే అంత మంచి ఆరోగ్యాన్ని సంపాదించుకున్న వారమవుతామని ఆదోని ఎమ్మెల్యే పార్థసారథి అన్నారు. శనివారం సౌత్ ఇండియా టెన్నిస్‌బాల్ క్రికెట్ టోర్నమెంట్ ఆదోనిలో జరిగింది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే పాల్గొని టోర్నమెంట్‌ను ప్రారంభించారు. ఎమ్మెల్యే క్రికెట్ ఆడుతూ క్రీడాకారులను ఉత్సాహపరిచారు.

గౌరవం లేదు.. వేతనం రాదు!

- ప్రజాప్రతినిధులకు ప్రభుత్వ కార్యక్రమాలకు ఆహ్వానాలు లేవు
- 19 నెలలుగా గౌరవ వేతనాలు నిలిపివేత
- మండల సర్వసభ్య సమావేశాలకే పరిమితం
- ప్రభుత్వ కార్యక్రమాల్లో టీడీపీ నేతలకే ప్రాధాన్యత
- కనీస గౌరవం ఇవ్వకపోవడంపై ఎంపీటీసీ సభ్యుల ఆవేదన



పెద్దకడబూరు ఎంపీడీఓ కార్యాలయం

పెద్దకడబూరు : ప్రజల చేత ఎన్నుకోబడిన మండల ప్రాదేశిక నియోజకవర్గాల సభ్యులు(ఎంపీటీసీ) పట్ల కూటమి ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరిని చూపుతుందనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ప్రజా ప్రతినిధులకు గౌరవంతో పాటు గౌరవ వేతనాలు లేకుండా పోయాయి. గ్రామాలలో తమకు ఏపనులు చేయంచలేని పరిస్థితి దాపరించిందని ఎంపీటీసీలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

19 నెలలుగా అందని గౌరవ వేతనం

మండలంలో మొత్తం 16మంది ఎంపీటీసీ సభ్యులు ఉన్నారు. వీరికి ప్రతినెలా రూ. 3వేలు చొప్పున గౌరవ వేతనము ఇవ్వాల్సి ఉంది. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం హయాంలో రెండు విడతల్లో గౌరవ వేతనాలు చెల్లించారు. సార్వత్రిక ఎన్నికలు రావడంతో మూడో విడత నిధులను మంజూరు చేసే అవకాశం లేకుండా పోయింది. అయితే కూటమి ప్రభుత్వం ఏర్పడి సంవత్సరం కావడంతో సంబరాలు చేసుకుంటుంది కానీ తమ గురించి పట్టించుకున్న పాపాన పోలేదని వారు గోడు వెళ్లగక్కుతున్నారు. సుమారుగా 19 నెలల పాటు గౌరవ వేతనము కూడా అందడం లేదని పలువురు ఎంపీటీసీ సభ్యులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎంపీటీసీల గౌరవ వేతనాలకు బిల్లులు పెడుతున్నామని అధికారులు చెబుతున్నారే తప్పా.. ఖాతాల్లో మాత్రం నగదు జమ కాలేదని వారు వాపోతున్నారు. ప్రజల చేత ఎన్నుకోబడిన ప్రజాప్రతినిధులమైన తమకు అధికారులు ఏమాత్రం గౌరవము ఇవ్వడం లేదని వారు ఆరోపిస్తున్నారు. ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల అమలులో టీడీపీ నాయకులకు ప్రాధాన్యత ఇస్తూ తమను పట్టించుకోవడం మానేశారని మండిపడుతున్నారు.

చాయ్, బిస్కెట్లకే పరిమితం

కూటమి ప్రభుత్వం ఏర్పాటైనప్పటి నుంచి మండలంలో మూడు నెలలకు ఒకసారి జరుగుతున్న సర్వసభ్య సమావేశాలకు హాజరై వారు పెడుతున్న స్వీట్లు లేదా బిస్కెట్ చాయ్‌లకే మా పదవి కాలం సరిపోయేటట్టు ఉందని పలువురు ఎంపీటీసీ సభ్యులు బాధను వెళ్లగక్కుతున్నారు. ఒకవేళ సర్వసభ్య సమావేశంలో పాల్గొని తమ పరిధిలోని ప్రజా సమస్యలు పరిష్కరించాలని మండల అధికారుల దృష్టికి తీసుకెళ్లినా.. పట్టించుకున్న పాపాన పోలేదని వాపోతున్నారు. కనీసం అధికారిక కార్యక్రమాలకు కూడా తమను ఆహ్వానించడం లేదని ఆక్రోశం వెళ్లగక్కుతున్నారు. నిధులు మంజూరుపై తమకు కనీస సమాచారం ఇవ్వడం లేదని, తమను వివక్షకు గురి చేస్తున్నారని మదనపడుతున్నారు.

బిల్లులు పెట్టాం



ఎంపీటీసీ సభ్యులకు వేతనం కొరకు బిల్లులను పెట్టాం. గతంలో 16నెలల వేతనం కోసం పెట్టాం.. ఈ మధ్యనే మరో మూడు నెలల బిల్లులు పెట్టాం. ఇంకా ప్రభుత్వం నుంచి ఎలాంటి ఆదేశాలు అందలేదు. బిల్లులు మంజూరు అయిన వెంటనే వేతనం అందిస్తాం.

– ప్రభావతి ఎంపీడీఓ పెద్దకడబూరు

కనీసం విలువ లేకుండా పోయింది



ప్రజలచేత ఎన్నుకోబడిన తమకు ఎంతో గుర్తింపు ఉంటుందని ఆశించా. కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక ఎంపీటీసీలకు కనీసం విలువ లేకుండా పోయింది. గ్రామంలో ఓట్లువేసి గెలిపించిన ప్రజలకు ఏమి చేయలేక పోతున్నామని బాధేస్తుంది. గత 19 నెలలుగా వేతనము కూడా లేదు. మామీద మాకే జాలేస్తుంది.

– వెంకటేశ్వర్లు, ఎంపీటీసీ, జాలవాడి గ్రామం

ప్రజా ప్రతినిధులను హోదాలకే పరిమితం చేయొద్దు



మూడు నెలలకు ఒకసారి జరిగే సర్వసభ్య సమావేశంలో ప్రజా ప్రతినిధులను నిర్లక్ష్యం చేయొద్దని అధికారులకు చెబుతున్నాం. అధికారులు మాత్రం అధికారపార్టీ నాయకులకే ఓటు వేస్తున్నారే తప్పా వారిలో మార్పు మాత్రం కనిపించడం లేదు. మండలంలో ఏ కార్యక్రమం జరిగినా కనీస ప్రొటోకాల్‌ను పాటించకుండా టీడీపీ నాయకుల సమక్షంలోనే అన్నీ కానిస్తున్నారు. ఎంపీపీ మాటలకు విలువ లేకుండా పోయింది. –ఎంపీపీ శ్రీవిద్య

ప్రశాంత జీవనాన్ని అలవర్చుకోండి



కుంటనహాల్‌లో మాట్లాడుతున్న డీఎస్పీ ఉపేంద్రబాబు

కౌతాళం: ప్రజలు ప్రశాంత జీవనాన్ని అలవర్చుకోవాలని ఎమ్మిగనూరు డీఎస్పీ ఉపేంద్రబాబు అన్నారు. మండలంలోని కుంటనహాల్ గ్రామాన్ని ఆయన సీఐ అశోక్‌కుమార్‌తో కలిసి శనివారం పర్యటించి ఎస్సీఎస్టీ కేసు విచారణ చేపట్టారు. ఆయన మాట్లాడుతూ అందరు కలిసి కట్టుగా ప్రశాంతంగా జీవించాలన్నారు. ఇలాంటి చిన్న చిన్న గొడవలు కాని అల్లరులు కాని చేయకూడదన్నారు. ఎవరైన అసాంఘీక కార్యాకలాపాలకు పాల్పడితే ఎంతటి వారైన సరే ఉపేక్షించేది లేదన్నారు. పిల్లలను బాగా చదివించి మంచి పౌరులుగా తీర్చిదిద్దాలని సూచించారు. ఆయన వెంట పోలీసు సిబ్బంది ఉన్నారు.

గోనెగండ్లలో ఉచిత కంటి వైద్య శిబిరం

గోనెగండ్ల : మండల కేంద్రం గోనెగండ్లలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల (బస్టాండ్)లో రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో శనివారం ఉచిత కంటి వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. శిబిరంలో ఎమ్మిగనూరు ఆర్‌కే హాస్పిటల్ డాక్టర్ హేమంత్ కుమార్ హాజరై కంటి వైద్య పరీక్షలు చేశారు. 160 మందికి కంటి పరీక్షలు చేసి అవసరమైన వారికి డ్రాప్స్, మందులను ఉచితంగా అందజేశారు. ఇందులో 46 మందిని ఆపరేషన్లు అవసరమని గుర్తించారు. వారికి ఎమ్మిగనూరు ఆర్‌కే ఆస్పత్రిలో ఈనెల 15వ తేదీ నుంచి 19వ తేదీ వరకు ఉచితంగా కంటి ఆపరేషన్లు చేయనున్నట్లు డాక్టర్ తెలిపారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ అధ్యక్షుడు కేఆర్ శ్రీనాథ రెడ్డి, కార్యదర్శి సుధాకర్, ప్రోగ్రాం ఆర్గనైజర్ కేఆర్ నటరాజరెడ్డి, కోశాధికారి మాచాని నాగరాజు, సభ్యులు బీరప్ప, కేశవరెడ్డి, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

గరుడాద్రి దత్తాత్రేయశర్మకు ఎన్టీఆర్ స్మారక అవార్డు



గరుడాద్రి దత్తాత్రేయశర్మకు నందమూరి తారక రామారావు స్మారక అవార్డుతో సత్కరిస్తున్న దృశ్యం

ఆదోని అర్బన్: పట్టణానికి చెందిన విద్యావాచస్పతి డాక్టర్ గరుడాద్రి దత్తాత్రేయశర్మకు శనివారం తెలుగు వెలుగు సాహితీ వేదిక మరియు కాళోజీ తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్ వారు నందమూరి తారక రామారావు స్మారక పురస్కారాన్ని శనివారం హైదరాబాద్ శ్రీ త్యాగరాయ గాన సభలో అందించారు. తెలుగు వెలుగు సాహితీ వేదిక జాతీయ అధ్యక్షుడు డాక్టర్ పోలోజు రాజకుమారాచార్యులు, రాష్ట్ర అధ్యక్షుడు మండలి లక్ష్మణ్‌బాబు చేతుల మీదుగా అవార్డును అందజేశారు. గత 23 సంవత్సరాలుగా ఆగస్టు 29వ తేదీన తెలుగు భాషా దినోత్సవాలు నిర్వహిస్తూ కర్నూలు జిల్లాలో అనేక పాఠశాలల్లో విద్యార్థినీ, విద్యార్థులకు తెలుగు భాష, సాహిత్యంపై వివిధ రకాల పోటీలను దత్తాత్రేయశర్మ నిర్వహించారన్నారు.

నేరాలపై అప్రమత్తంగా ఉండాలి



ప్రయాణికులకు జాగ్రత్తలు వివరిస్తున్న టూటౌన్ పోలీసులు

ఆదోని టౌన్: నేరాలపై ప్రయాణికులు అప్రమత్తంగా ఉండాలని టూటౌన్ సీఐ రాజశేఖర్ అన్నారు. శనివారం ఆదోని ఆర్టీసీ బస్టాండులో ప్రయాణికులకు నేరాలపై అవగాహన కల్పించారు. ఇటీవల కాలంలో బస్టాండులో సెల్‌ఫోన్ల అపహరణ, మహిళల మెడలో బంగారు ఆభరణాలు అపహరణకు గురవుతున్నాయన్నారు. ప్రజలు అప్రమత్తంగా మెలగాలన్నారు. అనుమానాస్పద వ్యక్తులను గుర్తించి పోలీసులకు సమాచారం అందించాలన్నారు. బస్సుల్లో ఎక్కేటప్పుడు దిగేటప్పుడు బ్యాగుల్లో సామన్లు, లగేజీలు తీసుకెళ్లే సమయంలో సరి చూసుకోవాలని తెలిపారు.

స్మార్ట్‌మీటర్లకు వ్యతిరేకంగా పోరుబాట

ఎమ్మిగనూరుటౌన్: ప్రజలపై విద్యుత్ చార్జీల భారం మోపడమే కాకుండా స్మార్ట్‌మీటర్ల పేరుతో ఇబ్బందులు తెచ్చే ప్రభుత్వ వైఖరిపై పోరుబాటకు ప్రజలు ముందుకు కదలిరావాలని సీపీఎం పట్టణ కార్యదర్శి గోవిందు పిలుపునిచ్చారు. ఆదివారం స్మార్ట్‌మీటర్లపై పోరుబాట కార్యక్రమాన్ని పట్టణంలోని ఎన్టీఆర్ కాలనీలో నిర్వహించారు. సీపీఎం నాయకులు రాముడు, అబ్దుల్లాలతో కలిసి ఆయన కాలనీలో ఇంటింటికి వెళ్లి స్మార్ట్ మీటర్లతో వచ్చే నష్టాలు, విద్యుత్ చార్జీల పెంపు తదితర అంశాలను ప్రజలకు వివరిస్తూ ర్యాలీ చేశారు. ఇళ్లకు స్మార్ట్‌మీటర్లు బిగించేందుకు వస్తున్నారని వాటిని వ్యతిరేకించాలని ప్రజలకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు లక్ష్మన్న, పరమేష్, చంద్రుడు, చేనేత కార్మిక సంఘ అధ్యక్ష, కార్యదర్శులు లక్ష్మన్న, కాలప్ప పాల్గొన్నారు.

కోసిగి: మండలంలోని డి.బెళగల్, చిన్న భూంపల్లి, పెద్దభూంపల్లి, ఐరన్‌గల్లు, జంపాపురం, సజ్జలగుడ్డం గ్రామాల్లో సీపీఎం మండల నాయకులు రాముడు, వీరేష్, హనుమంతు పర్యటించి రైతులకు అవగాహన కల్పించి కరపత్రాలు పంపిణీ చేశారు. ఈనెల14న విద్యుత్ సబ్ సబ్ స్టేషన్ ఎదుట ఆందోళన కార్యక్రమానికి తరలి రావాలని పిలుపునిచ్చారు.

ఆదోని రూరల్: మండలంలోని కుప్పగల్ గ్రామంలో సీపీఎం నాయకులు రామాంజనేయులు ఆధ్వర్యంలో స్మార్ట్ మీటర్ల వల్ల నష్టాలపై ప్రజలకు కరపత్రాలను పంచుతూ అవగాహన కల్పించారు. వెంకటేష్, రమేష్, తిమ్మన్న పాల్గొన్నారు.

కూలిన మట్టిమిద్దె



గోనెగండ్ల : మండల కేంద్రంలోని బీసీ కాలనీలో శుక్రవారం రాత్రి ఇంటి మిద్దె కూలింది. బోయ కౌలుట్లయ్యకు భార్య లక్ష్మి, కుమారుడు, ముగ్గురు కూతుళ్లు ఉన్నారు. వీరు గ్రామంలోనే కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. వీరికీ పాత మట్టి మిద్దె ఇల్లు ఉంది. రెండు రోజుల క్రితం కురిసిన వర్షాలకు మట్టిమిద్దె కాస్తా కుంగింది. శుక్రవారం రాత్రి 10 గంటల సమయంలో కుటుంబ సభ్యులు ఒక మూలన కూర్చొని భోజనం చేస్తుండగా.. ఒక్కసారిగా మిద్దె కూలింది. ముందే గమనించిన వారు భయంతో బయటకు పరిగెత్తారు. దీంతో ఎటువంటి ప్రమాదం జరగలేదు. ఉన్న ఇల్లు కూలడంతో తన కుటుంబం నివసించడానికి ఇల్లు లేదని, ప్రభుత్వం ఇల్లు మంజూరు చేసి ఆర్థికసాయం అందించాలని బాధితుడు కౌలుట్లయ్య కోరుతున్నాడు.

కూలిన వీధి దీపాల స్తంభం



కూలిన పార్క్‌రోడ్‌లోని డివైడర్ మధ్యలో వున్న ఇనుప స్తంభం

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలోని పార్క్‌రోడ్‌లో వున్న డివైడర్ మధ్యలో వున్న వీధి దీపంకై వున్న ఇనుప స్తంభం శనివారం కూలిపోయింది. ఆ సమయంలో అటుగా వెళుతున్న ఓ వ్యక్తికి స్వల్పగాయమైంది.అయితే గత 20 రోజుల క్రితం ఇదే రోడ్డులో మరో ఇనుప స్తంభం కింది భాగాన తుప్పుపట్టి కూలిపోయింది. స్తంభం కూలిపోయినప్పుడు ఆప్రాంతంలో ఎవరు లేకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. మున్సిపల్ అధికారులు స్పందించి శిథిలమైన వీధి దీపాల స్తంభాలను తొలగించి, వాటి స్థానంలో వేరే స్తంభాలను ఏర్పాటు చేయాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

15 లోపు పంటల బీమా చేయించుకోవాలి

గోనెగండ్ల : ఖరీఫ్ సీజన్‌లో పంటలు సాగు చేసిన ప్రతి రైతు ఈనెల 15లోపు పంటల బీమా చేయించుకోవాలని ఏడీఏ మహమ్మద్ ఖాద్రీ, ఏఓ హేమలత సూచించారు. శనివారం వారు రైతు సేవా కేంద్రంలో మాట్లాడుతూ వేరుశనగ పంటకు ఎకరాకు రూ.2వేలు, వరి కు రూ.560, మిరప రూ.360, ఉల్లి రూ.90 ప్రకారం ప్రీమియం చెల్లించి పంటల బీమా చేసుకోవాలన్నారు. అతివృష్టి, అనావృష్టి వలన పంటలు నష్టపోతే బీమా వర్తిస్తుందన్నారు.

ఓనర్లు రాకపోతే వాహనాలు వేలం వేస్తాం

ఆదోని అర్బన్: 2023 డిసెంబర్‌లో పట్టుబడిన వాహనాలకు సరైన రికార్డులు చూపించి తీసుకెళ్లాలని, లేకపోతే వాహనాలను వేలం వేస్తామని వన్‌టౌన్ సీఐ శ్రీరామ్ శనివారం తెలిపారు. వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ద్విచక్ర వాహనాలను సరైన పత్రాలు లేకపోవడంతో 12-12-2023న టూ వీలర్ వాహనాలను స్వాధీనం పరుచుకోవడం జరిగిందన్నారు. వాటి యజమానులు స్టేషన్‌కు వచ్చి సరైన పత్రాలు చూపించి తీసుకెళ్లాలన్నారు. ఈనెల 16వ తేదీన ఉదయం 11 గంటలకు టూటౌన్ పోలీస్ స్టేషన్ వెనక పోలీస్‌క్వార్టర్స్ సమీపంలో 20 వాహనాలకు వేలం వేస్తామని తెలిపారు. వాహనాలను కొనదలిచిన వారు తమ ఆధార్‌కార్డు కాపీలను తీసుకొని వచ్చి వేలంలో పాల్గొనాలన్నారు.

యల్లమ్మ అంబాభవానికి ప్రత్యేక పూజలు



దేవతా మూర్తులలకు పూజలు చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలోని 1వ వార్డులో నిర్మితమవుతున్న ఆషాఢ యల్లమ్మ అంబాభవాని ఆలయంలో ప్రతిష్ఠించనున్న దేవతా మూర్తులకు శనివారం వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు కామర్తి నాగేషప్ప, మహిళా అధ్యక్షురాలు లతారెడ్డితో పాటు పలువురు నాయకులు ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు కరె రాము, పామయ్య, మాచాని రఘు, యువజన విభాగ నాయకులు బసిరెడ్డి, కడిమెట్ల నాగార్జున రెడ్డి, నరసింహులు పాల్గొన్నారు.

జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోండి

ఆదోని అర్బన్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఈనెల 17వ తేదీన ఆదోనిలోని సాయి డిగ్రీ కళాశాలలో నిర్వహించే జాబ్‌మేళాను నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని ఆదోని ఎమ్మెల్యే పార్థసారథి కోరారు. శనివారం స్థానిక క్యాంపు కార్యాలయంలో ఆయన జాబ్‌మేళాకు సంబంధించిన పోస్టర్లను విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ జాబ్‌మేళాలలో 10 కంపెనీలు పాల్గొంటున్నాయన్నారు. టెన్త్, ఇంటర్, డిగ్రీ, ఐటీఐ, డిప్లొమా, బి.ఫార్మసీ చదువుకుని 18 సంవత్సరాల నుంచి 30 సంవత్సరాల్లోపు వయస్సున్న నిరుద్యోగ అభ్యర్థులు అర్హులన్నారు.

రైలు కింద పడి ఆత్మహత్య

కౌతాళం: రైలు కింద పడి గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడని రైల్వే ఎస్ఐ గోపాల్ శనివారం తెలిపారు. కుప్పగల్-ఇస్వీ రైల్వే స్టేషన్ మధ్య శుక్రవారం రాత్రి ట్రైన్ నెంబర్ 12731 కింద పడి ఆత్మహత్యకు పాల్పడ్డాడని, అతని వద్ద ఎలాంటి ఆధారాలు లేవన్నారు. చనిపోయిన వ్యక్తి హిందువుగా గుర్తించామని అతడిని గుర్తించినచో వివరాలు తెలపాలని కోరారు.

అన్నదానానికి రూ.2లక్షల విరాళం

మంత్రాలయం రూరల్ : ప్రముఖ ఆధ్యాత్మిక కేంద్రం శ్రీరాఘవేంద్ర స్వామి మఠం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నిత్యాన్నదానానికి బెంగళూరుకు చెందిన కౌశల్ కావలె అనే భక్తుడు రూ. 2 లక్షలు విరాళంగా అందజేసినట్లు శ్రీ మఠం మేనేజర్ ఎస్‌కే శ్రీనివాసరావు తెలిపారు. ఈ సందర్భంగా శ్రీ మఠం అధికారులు ఆయనకు శేష వస్త్రం, రాఘవేంద్రుల జ్ఞాపిక అందజేశారు.

అధిక ధరకు విక్రయిస్తే చర్యలు



రైతులకు యూరియాను పంపిణీ చేస్తున్న ఏడీఏ బాలవర్ధిరాజు

ఆదోని రూరల్: ప్రైవేట్ డీలర్లు ఎమ్మార్పీల కంటే అధికంగా యూరియాను విక్రయిస్తే చర్యలు తీసుకుంటామని ఏడీ బాలవర్ధిరాజు, ఏఓ సుధాకర్ హెచ్చరించారు. రైతులకు యూరియా అందుబాటులో ఉందని తెలిపారు. శనివారం రైతు సేవా కేంద్రాలు, డీసీఎంఎస్ ద్వారా రైతులకు యూరియాను పంపిణీ చేశారు. వారు మాట్లాడుతూ 950 యూరియా బస్తాలు ప్రైవేట్ డీలర్ల ద్వారా రైతులకు పంపిణీ చేశామన్నారు.అలాగే పెద్దహరివాణం గ్రామానికి 600 బస్తాలు, సంతెకూడ్లూరుకు 300 బస్తాలు, ఢణాపురంకు 600 బస్తాలు చొప్పున సరఫరా చేశామన్నారు. కావాల్సిన రైతులు రైతుసేవా కేంద్రాలకు వెళ్లి యూరియాను పొందాలన్నారు.

వైఎస్సార్‌సీపీ అనుబంధ విభాగాల అధ్యక్షుల నియామకం

పెద్దకడబూరు : పార్టీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు పార్టీ కేంద్ర కార్యాలయం మండల అనుబంధ విభాగాల అధ్యక్షులను నియమించడమైనది. యూత్ వింగ్ అధ్యక్షుడిగాఆర్ సాయికిరణ్‌రెడ్డి, మహిళా విభాగం వి.కె.ఆర్ రాజేశ్వరి, రైతు విభాగం కె నరసన్న, బీసీ సెల్ జి గాదిరెడ్డి, ఎస్సీ సెల్ బి అర్లప్ప, మైనార్టీ సెల్ ఇస్మాయిల్, క్రిష్టియన్ మైనార్టీ సెల్ అధ్యక్షుడిగా ఎం ప్రభాకర్ నియమితులయ్యారు. స్టుడెంట్ వింగ్ అధ్యక్షుడిగా బి.కె రామకృష్ణ, పంచాయతీరాజ్ వింగ్ కే.వెంకటేశ్వర్లు, ఆర్‌టీఐ వింగ్ అమీర్‌ఖాన్, వలంటీర్స్ వింగ్ వి నరసింహ ఆచారి, గ్రీవెన్సీ సెల్ డి షాబీర్ షావలి, వాణిజ్య విభాగం హెచ్.కె వీరబ్రహ్మ ఆచారి, అంగన్‌వాడీ వింగ్ ఎం ఆరోగ్యమ్మ, లీగల్ సెల్ ఎ సుధారెడ్డి, కల్చరల్ వింగ్ జి వీరారెడ్డి, సోషల్ మీడియా వింగ్ ఈ యోగేంద్రగౌడ్, ఐటీ వింగ్ బి హర్షవర్ధన్‌రెడ్డి, దివ్యాంగుల వింగ్ బి భీమన్న, మేధావి వర్గం కె బ్రహ్మ ఆచారి, బూత్ కమిటీల వింగ్ బి మూకిరెడ్డి, పబ్లిసిటీ వింగ్ అధ్యక్షుడిగా ఎం రామాంజినేయులును నియమించారు.

ఎరువుల దుకాణాల్లో తనిఖీ

ఆదోని రూరల్: పట్టణంలోని ప్రైవేట్ ఎరువుల దుకాణాల్లో యూరియా నిల్వలపై ఏఓ సుధాకర్ శనివారం సాయంత్రం తనిఖీలు చేపట్టారు. ఆయన యూరియా నిల్వలు, ఎమ్మార్పీ ధరలపై రికార్డులను పరిశీలించి డీలర్లకు సూచనలు చేశారు. యూరియాను ఎమ్మార్పీకే రైతులకు అందించాలని, ఏవైనా లింకు ఎరువును జతచేసి అమ్మినచో చర్యలు తప్పవని హెచ్చరించారు. రైతులు కేడీసీఎంఎస్‌తో పాటు ప్రైవేట్ ఎరువుల దుకాణాల్లో కూడా యూరియాను కొనుగోలు చేసుకోవచ్చని సూచించారు.

విద్యుత్ సరఫరా వేళల్లో మార్పు

కోసిగి: మండలంలో వ్యవసాయానికి విద్యుత్ సరఫరాలో మార్పులు ఉంటాయని ట్రాన్స్ కో ఏఈ వీరేష్ తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ జిల్లాలో 220 కేవీ నుంచి గూడూరు 132 కేవీ ఫీడర్ వరకు మరమ్మతులు జరుగుతున్నాయన్నారు. దీంతో ఈనెల 17వ తేదీ వరకు వ్యవసాయానికి విద్యుత్ సరఫరాలో మార్పులు ఉంటాయని, ఇందుకు రైతులు సహకరించాలని కోరారు.

కారుణ్య నియామకాలు చేపట్టాలి

ఎమ్మిగనూరుటౌన్: స్థానిక మున్సిపాలిటీలో పని చేస్తూ పలు అనారోగ్య కారణాలతో మృతి చెందిన కార్మికుల కుటుంబాల్లో ఒకరికి ఉద్యోగం కారుణ్య నియామకాల కింద ఉద్యోగం ఇవ్వాలని ఏపీ మున్సిపల్ వర్కర్స్ యునియన్ జిల్లా ఉపాధ్యక్షుడు ఎల్లప్ప, సీపీఐ నాయకులు రంగన్న, భాస్కర్‌యాదవ్ కోరారు. శనివారం పత్తికొండలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణను కలిసి సమస్యలను ఆయన తీసుకెళ్లి ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని కోరినట్లు తెలిపారు. స్పందించిన ఆయన వెంటనే జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లగా ఎమ్మిగనూరు మున్సిపాలిటిలో 48మంది కొత్త కార్మికులను తీసుకోవాలని ఆదేశాలిచ్చినట్లు పేర్కొన్నారు. అందులో 13మందికి మొదటి ప్రాధాన్యతగా కారుణ్య నియామకం కింద ఉద్యోగాలు ఇచ్చేలా మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి కూడా సమ్మతించినట్లు వారు తెలిపారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

ఎమ్మిగనూరుటౌన్: భవన నిర్మాణ కార్మికుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని బిల్డింగ్ వర్కర్స్ యునియన్ జిల్లా అధ్యక్షుడు ఖాజాపాషా, సీఐటీయూ అధ్యక్ష, కార్యదర్శులు గోవిందు, రాముడు డిమాండ్ చేశారు. శనివారం పట్టణంలో పెద్దపార్క్‌లో బిల్డింగ్ వర్కర్ల సమావేశం ఆ సంఘ నాయకుడు మహమ్మద్ హుసేన్ అధ్యక్షతన జరిగింది. వారు మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికులు కూలీ గిట్టుబాటుకాక ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రభుత్వం దేశవ్యాప్తంగా సంక్షేమ బోర్డ్‌ను ఏర్పాటు చేసి ఆదుకోవాలని కోరారు. అనంతరం బిల్డింగ్ వర్కర్స్ యునియన్ కన్వీనర్‌గా విజయ్‌కుమార్‌తో పాటు 11 మంది కార్యవర్గ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఖాజాహుసేన్, నాగరాజు, ఖాదర్‌వలి, బీరప్ప, ఈరన్న పాల్గొన్నారు.

తీర ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

నందవరం : టీబీ డ్యాం ఎగువన వర్షాలు కురవడంతో తుంగభద్ర నదికి వరద నీరు ప్రవాహిస్తుడడంతో నది ప్రవాహక ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ శ్రీనివాసులు సూచించారు. శనివారం మండల పరిధిలోని నాగలదిన్నె, రాయచోటి, జొహరాపురం, నదికైరవాడి, గంగవరం, పెద్దకొత్తిలి తదితర గ్రామాల్లో రెవెన్యూ అధికారులు ఆదివారం దండోరా వేయించారు. ఆయన మాట్లాడుతూ.. నదికి వరద నీరు తాకిడి ఎక్కువగా ఉండడంతో జాలర్లు, పశువుల కాపర్లు, బట్టలు ఉతకడానికి మహిళలు నది వైపు వెళ్లరాదని సూచించారు.

కౌతాళం మండలంలో పదవుల పందేరం

కౌతాళం: వైఎస్సాస్సార్‌సీపీ రాష్ట్ర అధ్యక్షుడు మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు పార్టీ కేంద్ర కార్యాలయం కౌతాళం మండల అనుబంధ విభాగాల అధ్యక్షులను నియమించింది. యూత్ వింగ్ మండల అధ్యక్షుడిగా తాహెర్‌వలి, మహిళ విభాగం అధ్యక్షురాలిగా రాజేశ్వరి, రైతు విభాగం సిద్ధరామగౌడ్, బీసీ సెల్ చాగి హనుమంతు, ఎస్సీ సెల్ ఎస్.ఆనంద్, ఎస్టీ సెల్ రేణుకా, మైనారిటీ సెల్ ఖాజాహుసేన్, విద్యార్థి విభాగం గోవిందు, పంచాయతీరాజ్ వింగ్ దివాకర్‌రెడ్డి, ఆర్టీఐ వింగ్ అధ్యక్షుడిగా వీరేష్‌ను నియమించారు. వలంటీర్ల వింగ్ అధ్యక్షుడిగా తేజావర్ధన్‌రెడ్డి, గ్రివెన్స్‌సెల్ శ్రీనివాసులు, వాణిజ్య విభాగం చాకలి సుధాకర్, వైఎస్సార్‌టీయూసీ చిన్నహుసేని, అంగన్‌వాడీ వింగ్ సుశీలమ్మ, కల్చరల్ వింగ్ బంగారయ్య, సోషల్ మీడియా వింగ్ మౌలసాబ్, ఐటీ వింగ్ కుమార్‌గౌడ్, దివ్యాంగుల విభాగం అధ్యక్షుడిగా ఈరన్న నియమితులయ్యారు. ఇంటలక్చువల్ ఫోరం విభాగం అధ్యక్షుడిగా ప్రసన్నగౌడ్, బూత్ కమిటీ వింగ్ ఆనంద్, పబ్లిసిటీ వింగ్ అధ్యక్షుడిగా వై. హనుమేష్‌ను నియమించారు.

చంద్రన్న బీమా పేరుతో మోసం



మాట్లాడుతున్న పట్టణ అధ్యక్షుడు కామర్తి నాగేషప్ప

ఎమ్మిగనూరుటౌన్: కూటమి ప్రభుత్వం చంద్రన్న బీమా అమలు చేయకండా ప్రజలను మోసం చేసిందని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర బీసీ విభాగ సంయుక్త కార్యదర్శి విరూపాక్షిరెడ్డి, పట్టణ అధ్యక్షుడు కామర్తి నాగేషప్ప, నియోజకవర్గ యూత్ అధ్యక్షుడు నజీర్‌అహమ్మద్ అన్నారు. శనివారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఎన్నికల ముందు కూటమి ప్రభుత్వం పేదబడుగు బలహీన వర్గాల వారి కుటుంబాల్లో ఎవరైన ప్రమాదవశాత్తు మృతి చెందితే చంద్రన్న బీమా కింద రూ.10లక్షలు, సహజమరణానికి రూ.5లక్షలు మంజూరు చేస్తామని చెప్పి ఏడాదిపాలన అయిపోయినా నేటికి దాన్ని అమలు చేయలేదని ధ్వజమెత్తారు. దానికి సంబంధించి నేటికి సచివాలయాల్లో వెబ్‌సైట్ ఓపెన్ కాలేదని ఓ వైపు సచివాలయ సిబ్బంది చెబుతున్నారన్నారు. సమావేశంలో వైఎస్సార్‌సీపీ నాయకులు బజారిరెడ్డి, వడ్డే వీరేష్, కడిమెట్ల నాగార్జునరెడ్డి, వివేక్ తదితరులు పాల్గొన్నారు.

మాజీ సీఎంకు కృతజ్ఞతలు

పార్టీలో తమకు సముచిత స్థానం కల్పించిన మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, నియోజకవర్గ పార్టీ ఇన్‌చార్జ్ బుట్టారేణుకలకు వైఎస్సార్‌సీపీ పట్టణ మహిళా అధ్యక్షురాలు లతారెడ్డి, అంగన్‌వాడి విభాగ జిల్లా కార్యదర్శి సావిత్రమ్మ ధన్యవాదాలు తెలిపారు. కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు.